# ఎవరు బాధ్యులు?

బి. యస్. ఆర్. కృష్ణారావు

ఆ అమ్మాయికి మీనాక్షి అని పేరు పెట్టినప్పుడు ఆ అమ్మాయి పుట్టంధురాలని తెల్సినప్పటికీ ఎందుకు పెట్టారో ఎవరికీ తెలియకపోయినా, వారొక కారణంచేత ఆ పేరు పెట్టారు. పెద్ద పిల్ల పేరు 'లోలాక్షి', రెండవ పిల్ల పేరు 'కామాక్షి'. మూడవపిల్ల అయిన ఈ పుట్టంధురాలికి పేర్ల పొందికకోసం 'మీనాక్షి' అని పేరుబెట్టారు. పేరుకు తగినట్లుగా ఆమె మీన లోచన అయి, ఆకళ్లు రెపరెపలాడుతూ మిలమిల మెరసి చూపరులను ఇట్టే ఆకర్షించక పోయినప్పటికీ, కనీసం సామాన్యంగానైనా కళ్లు లేవు. పుట్టంధురాలు. అమ్మాయి పుట్టగానే ఆ తల్లిదండ్రుల ముఖాలు వెలవెల బోయినయి. కారణం—తాము భాగ్యవంతులు కాకపోయినప్పటికీ, ఇల్లును చూసి ఇల్లాల్ని చూడాలనీ, తల్లిని చూసి పిల్లల్ని చూడాలనే సామెతగా ఆ పిల్లల యొక్క రూపసంపదను చూసీ, బుద్ధికుశలతను చూసీ దమ్మిడీ కట్నం అడక్కుండా పెళ్ళి చేసుకున్నారు పెద్దపిల్ల లిద్దర్నీ. ఈ మూడవ సారి కూడా ఆడపిల్ల కలిగినప్పటికీ పెద్దపిల్ల లిద్దరి మాదిరిగానే సునాయాసంగానే పెళ్ళయిపోతుందని ఆశించారు. కాని అంతవారూ కష్ట మనుభవించాల్సిన రోజులు కాబట్టే ఈ పుట్టంధురాలు కలిగిందని లోకులూ అనుకున్నారు. కన్న కడుపైనా తల్లిదండ్రులూ అనుకోక తప్పింది కాదు.

పిల్ల పెద్ద దవుతున్నకొద్దీ వయస్సుతోబాటు ఆమె అందచందాలు ద్విగుణీకృత మవుతూ న్నయి. చక్కని కబుర్లు ముత్యాలొలుకుతున్నట్లుగా చెబుతుంది. కాని ముక్కుతీరు పెద్దపిల్లలిద్దరికన్న కూడా ఎంతో అందంగా వుంటుంది. కాని సర్వప్రపంచాన్నీ తన తెల్లని, చల్లని కిరణాలచే ఆనందాబ్ధి నోలలాడించే చంద్రునికి మచ్చ ఉన్నట్లుగా, రూపరేఖా విలాసాలు అమితంగా వున్న ఈ 'మీనాక్షి'కి కళ్ళు మాత్రం లేవు.

ఆకాశము నీలముగా వుంటుందనిగాని, చంద్రబింబము తెల్లగా, చల్లగా వుంటుందనికాని, నక్షత్రాలు మినుకుమినుకుమంటూ వుంటవనిగాని, మల్లెపూవు తెల్లగా వుంటుందనిగాని, సంపెంగ పచ్చగా వుంటుందనిగాని, గులాబి ముద్దొస్తూంటుందనిగాని ఆమెకు తెలియదు. అమ్మ లేచి వాకిలి పాచిచేసి చల్ల చేస్తూంటే తెల్లవారిందని తెల్సుకునేది పక్కవేసిపడుకోమంటేగాని రాత్రయిందని తెలిసేదికాదు. పశువులకాపరి—గేదెను తోలుకుపోతున్నాను, అమ్మగారూ - అని తన తల్లితో చెప్పినప్పుడు చద్దన్నాల వేళయిందని తెల్సుకునేది. కమతగాడు పాలచెంబు అడిగినప్పుడు ముఖం కడగాలనుకునేది. రంగుల విషయం అసలే అవగాహన అయేది కాదు. తెల్లగా వుంటమంటే పాలు. పెరుగు మాదిరని అమ్మ చెప్పింది. అంటే తెల్లని పదార్థాలన్నీ పాలు, పెరుగు మాదిరే తినబండాలని ఊహించుకుంది. నల్లని పదార్థాలంటే తాటిచెట్టు మాను మాదిరీ, గేదె శరీరపురంగు మాదిరీ, కుంపటి వెలిగించే బొగ్గులమాదిరీ అని చెప్పింది. ఇంకేం, నల్లని పదార్థాలంటే ఈ మూడు పదార్థాలు మాత్రమే అనుకునేది. నల్లని పదార్థాలన్నీ తినటానికి అనర్హమైనవి. గులాబి రంగంటే తల్లో పెట్టుకునే పువ్వులాంటిదని చెప్పేది. ఎవరయినా మాటలసందర్భంలో గులాబిరంగు మాట ఎత్తితే, జడ సవరించుకునేది - పెట్టొస్తున్నారేమోనని.

ఆయేడు కాయేడు గడిచినకొద్దీ తల్లిదండ్రుల గుండెల్లో అన్నెసిరాళ్ళు పడేస్తున్నట్లు అనిపించేది. ఇంక అమ్మాయికి వోణీలు కావాల్సొచ్చేట్టుగా వుందనగానే ఆ తండ్రి గుండెలు ఒక్కసారిగా ఝల్లుమని తను కూడా అంధుడైపోయినట్లనిపించింది.

మీనాక్షి కుంటిది కాదు, అనాకారివి కాదు, తెలివితేటలు లేనిదికాదు, బుద్ధితెలియని పిల్ల కాదు. ఆమెను చూడగానే ఇంత చక్కని పిల్లకు ఆ గుడ్డితనమేమిటి ఖర్మ అని సానుభూతి చూపేవారు. ఆమె తెలివితేటలకూ, తేటతనానికీ తోడు కళ్ళున్నట్లయితే చేసుకున్న భర్తని తన పాదాక్రాంతుణ్ణి చేసుకునేది అనేవారు కొంతమంది. ఆమె కా రూపరేఖా విలాసాలు ఎవరిమ్మని ఏడ్చారు, కళ్లు లేకపోయిం తరువాత ఎంత అందగత్తె అయితేనేం, కళ్లుంటే ఎదురు డబ్బిచ్చి పెళ్ళి చేసుకునేవాళ్లు అనేవారు స్కూలు కుర్రాళ్లు. ఈ మాటలన్నీ ఒక్కొక్కప్పుడు ఆమె చెవిని పడుతూన్నప్పుడు ఆమె లేతమనస్సు ఏమీ తెలీక ఆ అంధకార ప్రపంచంలో దిగాలుపడి పోయేది.

వాకిట్లో కూర్చుంటే — గుడ్డిపిల్లా, గుడ్డి మీనాక్షీ నిన్ను పెళ్ళెవరు చేసుకుంటారే అని అంతా ఎగతాళి చేసేవారు  పెళ్ళంటే బాజా భజంత్రీలు వాయించటమే ననుకునేది. అంటే తమ ఇంటికి బాజాలు వాయించటానికి ఎవరూ రారు కామాలు అని విచారించేది. చుట్టుపక్కల ఏ మేళం మోగినా పెళ్లి జరుగుతుందని అనుకునేది. ఒక్కొక్కప్పుడు నీకు పెళ్ళెట్లా అవుతుందే అని ఎవరయినా అంటే ఈ తడవ బాజాలు మోగినప్పుడు వాళ్లని బతిమాలి మా ఇంటికి పిలిపించుకొని బాజాలు వాయించమని పెళ్లి చేసుకుంటా అనేది. ఆమె అమాయికత్వానికి అంతా కంట తడిపెట్టేవారు.

ఆమెకు బుద్ధి తెల్సినప్పటినుంచీ స్నేహితులెవరూ రావటంలేదు ఆడుకునేందుకు. వాకిట్లోకప్పుడప్పుడు ఒక కుక్క వస్తూండేది వాళ్లమ్మ అన్నం వేస్తూంటంనుంచి అన్నంవేసినా వెయ్యకపోయినా వాకిటిముందుకొచ్చి ఒక్కసారి మొరిగేది. వాళ్లమ్మ "జా దాదా" అంటం విన్నది. కుక్క మొరగగానే అన్నం లేకుండానే తనూ "జా దాదా" అనేది. కుక్క వచ్చి చేతులూ, పాదాలూ నాకేది. అదే తన నిజమైన స్నేహితురాలనుకుంది. ప్రపంచంలో ఏ వస్తువు ఆకారము ఎట్లా వుంటుందో ఆమెకు తెలీదు. కాబట్టి కుక్క ఒక జంతువనీ, మానవమాత్రులకీ దానికీ చాలా తేడావుందనీ ఆమెకు తెలియదు. ఆమెకు బాగా తెల్సిన భేదం ఒకటే. కుక్క తనమాదిరి మాట్లాడదు. దానికి తోక వుంటుంది. శరీరం మీద గుడ్డ లుండవు. పిలవగానే వచ్చి తన కాళ్లూ, చేతులూ నాకుతుంది. అంతకన్న తనను ఏమీ చేయదు. అందరిమాదిరిగా. గుడ్డిపిల్లా నీకు పెళ్లెట్లా అవుతుందే అని ఎగతాళి చెయ్యదు. అందుచేత ఆకుక్క ఆమెకు ఆప్తురాలయిన స్నేహితురాలు. అది లేకపోతే ఆమె మనస్సు చాలా వేదనపడేది.

ఆమె రెండవ స్నేహితురాలుపిల్లి. ఆయింట్లో ఎలకలబాధ చాలా జాస్తీగా వుంటంనుంచి వాళ్ల నాన్న ఒక పిల్లిని పెంచుతున్నాడు. ఈ పిల్లికీ, కుక్కకూ గల వ్యత్యాసము ఆమెకు తెల్సిందల్లా ఒక్కటే: కుక్క "బవ్ బవ్" మంటుంది, పిల్లి "మ్యావ్, మ్యావ్" అంటుంది. తడివి చూసినప్పుడు కుక్క శరీరంకన్న పిల్లి శరీరం చిన్నదిగా వున్నట్లు తెల్సేది. వాళ్లమ్మ పొద్దున పూట తన చద్దన్నంతో బాటుగా పిల్లిపిల్లకు కొంచెం పాలూ అన్నమూ పెట్టేది. ముందు పిల్లిపిల్ల తిన్నదో లేదో కనుక్కునిగాని తను అన్నం తినేదికాదు. తన అలికిడి వినీ వినగానే "మ్యావ్ మ్యావ్" అంటూ పిల్లి వచ్చి తన పాదాలు నాకుతూ వుండేది. ఈ కుక్క, పిల్లి తనను ఏమీ అనకుండా, అందరి మాదిరిగా గుడ్డిపిల్లా నీకు పెళ్ళెట్లా అవుతుందే అని ఎగతాళి చెయ్యకుండా, పిలవగానే వచ్చి తన కాళ్ళూ చేతులూ నాకుతూ వుండటంనుంచి వాటికన్న తనకు కొంచెం ఆధిక్యం వున్నట్లుగా తోచిందామెకు. అందుచేత వాటితో ఆమెకు స్నేహం ఎక్కువవటమే కాకుండా అవి సమయానికి రాకపోతే వాటిని కేకలేసేది, పిలవగానే రారేమని. వాటికి మాట్లాడే శక్తి లేకపోయినా తనమాదిరి జ్ఞానము కలవి కామాలని అనుకునేది. ఒక్కొక్కప్పుడు ఒక తమాషా జరుగుతుండేది. ఈపిల్లి, కుక్క ఒకదాని కొకటి తటస్థపడినప్పుడు రెండూ పెద్దగా అరుస్తూ అటూఇటూ పరుగెత్తేవి. వాటి అరుపులూ, పరుగులూ చూసి అవి రెండూ పోట్లాడుకుంటున్న వనుకుని "అలా పోట్లాడుకుంటే అమ్మతో చెప్పి కొట్టిస్తా నుండండి" అనేది. అంతేగాని ఆ రెంటికీ సహజవైరమనే విషయం తెలీదు

పెద్దపిల్ల లిద్దరికీ ఆమాట నలుగురిచేతా అనిపించుకోకుండానే పెళ్ళి చేశాడు తండ్రి. కాని ఈపిల్ల విషయం వచ్చేసరికి నవనాడులూ క్రుంగి పోసాగినవి, పెళ్ళెలా అవుతుందా అనే దిగులుతో. ఇదేమయినా కప్పిపుచ్చే లోపమయితే పెళ్ళయేవరకూ దాయవచ్చు. అందరికీ తెల్సిన విషయమే. పైకి బాహాటంగా కనుపించే విషయమే.

ఒకానొకరోజున ఆకాస్త మాటా దక్కింది. నలుగురినోళ్లలోనూ పడే రోజొచ్చింది. ఆ మూడురోజులూ గదిలో వుంచి తాళంవేశారు. తల్లి అన్నం పెట్టటానికి వచ్చినప్పుడు నేనేం తప్పుచేశానని నన్ను గదిలో పెట్టారమ్మా అని అడిగేది జాలిగా. ఆతల్లి చెప్పినా ఆమెకు అర్థమయేదికాదు. ఆ మూడురోజులూ చేయవలసిన పనంతా తల్లే చేసేది. అందు కామెకు కష్టం కలిగినా, లోకులంతా ఆడిపోసుకుంటారని భయపడ్డా, ఏ జన్మలోనో అతి ఘోరమైన పాపం చేసుకుంటేనేగాని ఇటువంటి గుడ్డిపిల్ల పుట్టదని తనను తాను నిందించుకున్నా రక్తస్పర్శనుంచి ఇవన్నీ అణగునపడిపోయి కుమార్తెమీద జాలితో కూడిన ప్రేమచేత చేయవలసిన పనులన్నీ చేసేది.

"అమ్మా, పెద్దమనిషవటమంటే ఏమిటే? ఇదివరకుదాకా లేంది ఒక్కసారిగా చాలా పొడుగ్గా ఎదిగానా?" అనేది అమాయికంగా, అర్థంకాక. తల్లి విషయమంతా చెప్పినా ఆమెకు మొదట్లో అర్థం కాలేదు. తరువాత కొద్దిరోజులకు అర్థమైంది.

"గుడ్డిపిల్లయినా, కుంటిపిల్లయినా ఆడదానికి పెళ్ళిచెయ్యక తప్పదు కదా- ఎన్నాళ్ళని ఇంట్లో అట్టే పెట్టుకుంటాము? దానికి తగినట్లుగా ఏ కుంటివాడికో ఇచ్చి పెళ్ళిచేస్తే మన బరువూ బాధ్యతా వదిలిపోతాయి ఇద్దరూ కలిసి అడుక్కొనయినా తింటారు" అని తల్లి పట్టుబట్టి తండ్రితో అంటూ వుండేది.

"ఎంత అందగత్తె అయినా పుట్టంధురాల్ని చూస్తూ చూస్తూ ఎవరు చేసుకుంటారే? చేసుకుని ఈ గుదిబండను మెడకు కట్టుకుని తిరుగుతాడా తన పన్లన్నీ మానుకుని? ఎవరయినా పెళ్ళి చేసుకుని సుఖపడదామని అనుకుంటారు గాని ఇటువంటిదాన్ని చేసుకుని దానికి చాకిరీచేస్తూ జీవితమంతా దుఃఖమయం చేసుకోరు కదా" అనేవాడు తండ్రి.

"ఏజన్మలో ఏపాపం చేశామో ఈజన్మలో ఈ గుడ్డిదాన్ని కన్నాము. అన్ని కష్టాలూ దీనివల్లనే పడాల్సొస్తున్నది. మీరు పట్టుబట్టి తిరిగి విచారిస్తే గంతకుతగ్గ బొంత ఎక్కడో అక్కడ దొరక్కపోదు. నారుపోసినవాడు నీరుపోయడా అన్నట్లుగా భగవంతుడూ మన కీవిషయంలో ఒకింత సాయం చెయ్యకపోడు."

"కన్నబిడ్డ అనే మమకారంచేత పెంచి పెద్దదాన్ని చేయటంనుంచి ఈబెడద మనల్ని చుట్టుకుని వేధిస్తున్నది. పాపంకాని పుణ్యంగాని ఇంతకన్న చెడేది లేదనుకుని ఏ ముష్టివాళ్ళకయినా ఇచ్చినట్లయితే ఈసరికి అడుక్కు తినటమయినా నేర్పేవాళ్లు. కన్న మమకారంచేత ఆపని చేయలేకపోవటంనుంచి ఇంతవరకు వచ్చింది. 'పాపీ చిరాయుః' అన్నట్లుగా ఇటువంటివాళ్ళకి భగవంతుడు ఆయుర్దాయంకూడా ఎక్కడలేనిదీ ఇస్తాడు."

"ఎన్ననుకున్నా లాభంలేదు. కాళ్లనబడ్డ పాము కరవక తప్పదు. ఎక్కడో అక్కడ చూసి ముడిపెట్టేస్తే ఇక నిశ్చింతగా నిద్రపోవచ్చు" అని ఖచ్చితంగా చెప్పేది తల్లి.

"దీనికక్కాదు. దీన్ని కన్నందుకు ముందు నాకు చావొచ్చి పడింది. నే చచ్చినా పీడ వదిలిపోయేది" అని విసుక్కునేవాడు తండ్రి.

ఇప్పుడిప్పుడు పెళ్లంటే, కేవలం బాజా భజంత్రీలు వాయించటమే కాదనీ,తన అమ్మకు నాన్న ఎలాగో తనకూ ఒకవ్యక్తి అలాగే వుండాలనే భావాలు ఆమెకు కలిగినయి. తల్లి దండ్రులు తన పెళ్లి విషయంలో చేసే తర్జనభర్జనలూ, విసుగుచేత తనను ఒక్కొక్కప్పుడు చావమని తిట్టటమూ వినేసరికి తన గుడ్డితనంవల్ల యిద్దరూ ఎంతగా తన విషయంలోనూ, తన పెళ్లి విషయంలోనూ బాధ పడుతున్నారో గ్రహించుకునేది. తననుగురించి ఏమీ విచారపడవద్దని ఆమె వారితో చెబుదా మనుకున్నా ఆవిషయం తన ఊహకు అందని అతీతమైన విషయమనే సంగతి ఆమె లేతమనసుకు తెలియక

పోలేదు. తల్లిదండ్రులు తన విషయంలో ఇంతగా విచారపడి, అవస్థపడి, చిరాకుపడి, నిరాశపడి, విసుగుపడుతున్నారనే విషయం ఇప్పుడిప్పుడే ఆమెకు తెలుస్తున్నది. ఆమె మనస్సులో కలిగే ఈరకమైన బాధ ఇతరులతో చెప్పుకుని, మనస్సులోగల బరువు వదిలించుకుందామనుకున్నా, లేక వారి సలహా పొందుదామనుకున్నా ఆమెకా రెండు జంతువులూ తప్ప మరెవరూ స్నేహితులు లేరు. తనలో మరింత ఆవేదన కలిగినప్పుడు ఇంట్లో తిరుగాడుతూ తనకు అందుబాటులో వున్న పిల్లిని పిల్చి—

"నే గుడ్డిదాన్ననీ, నాకు పెళ్లికాదనీ, పెళ్లికాకుండా వుంటం చాలా తప్పనీ అమ్మా నాన్నా విసుక్కుని నన్ను తిడుతున్నారు. నన్ను ఏం చెయ్యమంటావు పిల్లీ? నేను గుడ్డిగా పుట్టటం నాతప్పా? నాకు కళ్లు అక్కర్లేదని నేను ఎవరితోనూ చెప్పలేదే—పుట్టుకతో ఉన్న దానికే, దేవుడు చేసిందానికే నన్నేం చేయమంటారు వీళ్ళంతా? పోనీ నువ్వేదయినా సలహా చెప్పవూ" అని జాలిగా దాని సమాధానంకోసం ఎదురు చూస్తూ దానితల నిమిరేది. ధన ధాన్యాలు కావాలనే ఆశ ఒకరి కుంటుంది. రాజ్యాలు సంపాదించాలనే కోరిక రాజుల కుంటుంది. అందమయిన స్త్రీ కావాలనే కోరిక మరొకరి కుంటుంది. పిల్లలు కావాలనే కోరిక ఇంకొకరి కుంటుంది. మంచిమంచి బట్టలు ధరించి తిరగాలనే కోరిక వేరొకరి కుంటుంది. దొంగతనం చెయ్యాలనే సంకుచితదృష్టి మరొకరి కుంటుంది. తనకు పెళ్ళి ఎట్లా అవుతుందా, అమ్మా నాన్నా తన విషయంలో ఇంత అవస్థ పడుతున్నారే అనే విచారం పుట్టంధురాలైన మీనాక్షి కుంది. కాని ఆ పిల్లికి ఇవేవీ అక్కర్లేదు. దాని ఆకలి తీర్చుకోటానికి ఎటువంటి ఆహారమయినా సరే, అదీ లేకపోతే ఒక్క చుంచెలుక అయినా చాలు. తన కేదైనా పెట్టబోతున్నారనే ఆశతో కళ్లార్పుతూ, తెరుస్తూ, మోరెత్తి చూస్తూ మధ్య పాదంతో వీపు గోక్కుంటూ, తన శరీరాన్ని తనే నాక్కుంటూ, తోకాడిస్తూ, ఆమె పాదాలు నాకుతూ, చెవులు విదిలించుకుంటూ "గురు గురు" మనే చిన్న గురకశబ్దంతో కూర్చుని "మ్యావ్, మ్యావ్" మనేది. ఆ మ్యావ్ శబ్దము మీనాక్షి అమాయికపు బుర్రలో అనేక వ్యాఖ్యానాలు చేసేది. "మీనాక్షీ, నువ్వేమీ విచారపడకు. నీకు పెళ్ళవుతుంది, నీ కష్టాలు తీరుతాయి, నీ మొగుడు నిన్ను అపేక్షగా చూస్తాడు. అన్నింటికీ ఆ దేవుడే ఉన్నాడు" అన్నట్లు అనిపించేది. ఇట్లాగే కుక్కకూడా తన ఘోష చెప్పుకుని అది అనే "బవ్, బవ్" శబ్దాన్ని అట్లాగే అన్వయించుకునేది. అప్పటికామె మనస్సు కొంచెం సంతృప్తిచెందేది.

తండ్రి కాళ్లు కదుములు కట్టేటట్లుగా అన్ని ఊళ్ళూ తిరిగాడు సంబంధాలకోసం. ముందుగానే అసలువిషయం చెప్పటంనుంచి మంచి సంబంధమే తెచ్చావని తిట్టేవారు కొందరూ, ఈయన పిచ్చివాడని నవ్వుకునేవారు కొందరూ కొట్టబోయేవారు కొందరూ, పాపం పిల్ల పెళ్ళికోసం ఎంత అవస్థపడుతున్నాడో అని సానుభూతి చూపేవారు కొందరూ-ఇట్లా అనేక రకాలయిన, అనేక తరహాలుగల వ్యక్తులు కనుపించారుగాని పెళ్ళి చేసుకుంటామని ఎవరూ చెప్పలేదు.

నిరాశతో, ఓవందరూపాయిలు దారిఖర్చులకు సమర్పించి, కాళ్ళీడ్చుకుంటూ ఇంటికొచ్చాడు తండ్రి. తండ్రి వస్తున్నాడని తెల్సి ఏం వార్త తెచ్చాడోననే ఆత్రుతతో ఎదురుగా వెళ్ళింది మీనాక్షి.

"గుడ్డిముండా, నాకీ పెద్దతనంలో నా ఉసురు నా నోట బోసి కొడుతున్నావు. నువ్వు నా కూతురువి కావు. నా పాలిటిమృత్యు దేవతవు. నా ఇంట్లో ఉండొద్దు పో" అని వీధిలోకి బర బరా ఈడ్చి తలుపేశాడు. తల్లి కాళ్ళా వేళ్ళా పడి బతిమాలింది భర్తని. ఏడ్చింది, కిందబడి దొర్లింది. కాని తిరుగుడుతో కరుడు గట్టిన ఆయన హృదయ కవాటంగాని, ఆ యింటి తలుపులుగాని తెరుచుకోలేదు.

"అయ్యా, నేను అంధురాల్ని; మర్యాదస్థుల వంశంలోపుట్టినదాన్ని-పెళ్లి కాలేదనే కోపంతో నన్ను మా నాన్న వెళ్ళగొట్టాడు. నా గోడు చెప్పుకుందామంటే ఈ ప్రపంచంలో నాకెవ్వరూ స్నేహితులు లేరు. ఉన్న పిల్లీ, కుక్కా కూడా సమయానికి నాకు సహాయంచెయ్యలేదు. పిల్లికి ఎలక కావాలి, కుక్కకు మాంసపుముక్క కావాలి, నాకు పెళ్ళికావాలి" అంటూ ఆ వీ

చివరనున్న అరుగు వరకూ తడుముకుంటూ వెళ్ళి అక్కడ కూర్చుంది. దారే పోయే వాళ్ళంతా చాలా సానుభూతి కనబర్చారు పెదవులమీద.

"పాపం, ఎంత అందగత్తె! అన్ని అవయవాలూ తీర్చిదిద్దినట్టుగా వున్నాయి. కాని దయామయుడయిన ఆ విధాత కళ్ళవిషయం లోనే ఇంత నిర్దయ కనపర్చాడు. పాపం! ఆ అమ్మాయి ఎవరో మర్యాదస్థుల బిడ్డల్లే నే వుంది. ఆమె గతేం కానుందో'' అని బుగ్గలు నొక్కుకుని, వేళ్ళు ముక్కుమీద వేసుకుని, పై గుడ్డలతో కళ్ళు తుడుచుకుని, నుదుటిమీద వేలితో 'కర్మ'అంటూ అడ్డంగా రాసుకుని వెళ్ళిపోసాగారు.

అవే మాటలు అంటూ అక్కడే కూర్చుంది. అంతా వస్తున్నారు,చూస్తున్నారు,పోతున్నారు. ఫలానివారి పిల్లని గుర్తుపట్టినవారు ఉన్నప్పటికీ మన కెందుకని ఊరుకుని వెళ్ళిపోయారు మానవ మాత్రులని అనిపించుకునే వారంతా. ఆమె కంఠంలో దైన్యమూ, ఆవేదనా, ఆక్రోశమూ పేరుకుని పేరుకుని, కదలలేక కదలలేక అస్ఫుటంగా వినిపించసాగాయి కొద్దిసేపయాక ఆమె మాటలు.

అత నెంత సేపట్నుంచి మీనాక్షిని చూస్తున్నాడో ఎవరూ గ్రహించలేదు. అందరితో బాటు అతనూ చూస్తున్నాడు. దీనాతిదీనమైన ఆ కంఠధ్వని అలాగే ఆ రణగొణ ధ్వనిలో ఒక మూలుగు శ్రుతిలా వినిపించిం దతనికి.

అతనిలో అనేక ప్రశ్నలూ సమాధానాలూ బయల్దేరినయి. తనలో తను అనుకున్నాడు. ఇదంతా ఒక విధి విధానము. సృష్టికర్త అంత అందాన్ని ఇచ్చినా దృష్టి విషయంలో తన సంకుచిత దృష్టిని దృఢంగా వ్యక్తపర్చుకున్నాడు. లేకపోతే బలీయమైన ఆమె పూర్వజన్మ పాపము పరిపక్వమై ఆమె నా స్థితికి తీసుకునివచ్చి వుంటుంది. దురూహమైన, ఊహాతీతమైన శక్తులు నిర్మించిన ఈ ప్రపంచపు మంచిచెడ్డలని గురించి మనం ఎంత తల మొత్తుకుంటే ఏం లాభం, ఏం ప్రయోజనం అనుకుని సంతృప్తి పడితే లాభం లేదు. మంచివారికి మంచివారు సహాయం చేయటం గొప్పలో జమ కాదు. అది కేవలం తమ సబుద్ధిని వ్యక్తపర్చటమే. ఇట్లాంటి వారికి సహాయం చేసినందువల్ల పరమాత్మ మెచ్చటమే గాకుండా ఆమె కని విని ఎరుగని, మనస్సుకందని సంతోషదాయకమైన సహాయము చేసిన వాడ వుతాను. కాబట్టి తప్పదు. ఎవరే మనుకొన్నా ఆ జీవికి అమిత సంతోషాన్ని చేకూరుస్తాను, మొదటి విషయం. అటువంటి వ్యక్తిని చేరదీశాను కదా అని నా మనస్సుకు నేను అమితంగా సంతోషపెట్టటం, రెండవది. మూడవది, భగవంతుని దృష్టిలో ఇటువంటి వారికి సహాయం చేసినందువల్ల తప్పకుండా ఉంటాననే ధైర్యం నాకుంది. అని ఆలోచించుకుని ఒక దృఢ నిశ్చయాని కొచ్చి ఒక్క వేడి నిట్టూర్పు విడిచి మెల్లిగా అరుగు దగ్గరకు వెళ్ళాడు.

"అమ్మాయీ, నీ పేరు?"

"మీనాక్షి."

"మీనాక్షీ నాతో వస్తావా?"

"ఎందుకండీ నన్ను ఎగతాళి చేస్తారు? మీ దార్ని మీరు పొండి." అన్నది నిరాశగా.

"లేదు, పరమాత్మ సాక్షిగా చెబుతున్నాను."

"మీకీ అంధదీనురాలిమీద అంత దయ కలిగితే నాకు దృష్టి వచ్చిందని తెల్సినప్పుడు కలిగే సంతోషం కన్నా ఎక్కువ సంతోష పడుతున్నాను. తప్పక వస్తాను" అంది సంతోషంతో. మెల్లిగా నవ్వుతూ. ఆనవ్వులో అమితానందం తొణికిసలాడింది. ముత్యా లొలికినట్లనిపించింది అక్కడివారికి. రెండు నిమిషాల్లో గుఱ్ఱంబండి తీసుకొచ్చా డతను.

"మీ రెవరోగాని చాలా ఉదారస్వభావులు, లేకపోతే నాగతి ఏమయివుండేదో?"

"వర్ణాంతర వివాహం చేసుకోటానికి అసలు నేనే అంగీకరించను. ఇంక ఉదారస్వభావ మనేది భగవత్ప్రేరితము" అన్నాడు నవ్వుతూ.

సంవత్సరన్నర గడిచిపోయింది. మేలి ముసుగుతో, నడికట్టుతో, కాళ్ళకు పసుపు పారాణులతో, చెవుల్లో దూదితో, తాంబూలపు రక్తిమ వర్ణముతో పెదవులు ముద్దు లొలుకుచుండగా పొత్తిళ్ళల్లో పిల్లవాడ్ని పెట్టుకుని, ముత్యా లొలుకు నవ్వుతో వచ్చి-

"ఏమండీ, అంతా పిల్లవాడు అచ్చంగా మీ పోలికే అంటున్నారు - నిజమేనా చూడండి" అన్నది.

"నిజమే, కాని కళ్లుమాత్రం నావికావు-నీవి" అన్నాడు ఎగతాళిగా.

"ఆఁ, నిజమే? అయితే వీడూ గుడ్డివాడై పోతాడా!" అంది ఆదుర్దాగా,విచారంగా. పకపకా నవ్వి- "ఎగతాళిగా అన్నాను మీనా, మనిద్దరి పోలికా వాడిలో మూర్తీభవించి వున్నది" అన్నాడు.

"నిర్భాగ్యురాల్ని కన్నబిడ్డను తడివిచూసి సంతోషించవలసిందేగాని వాడి ఆటపాటలూ, ముద్దు ముచ్చటలూ కళ్ళారాచూసే యోగం లేకపోయింది కదా" అని విచారపడింది.

"మీనా విచారపడకు, నేను చూస్తుంటాను కదా. వాడికి ఏలోపమూ రాదు. ఏదీ ఒక్కసారి నవ్వు" అన్నాడు. ఆమె ఉన్నట్టుండి నవ్వింది.

"అబ్బ, ఎంత బావున్నావు మీనా. కళ్ళు లేకపోవటంకూడా ఒక విధమైన అందాన్నిచ్చింది. ఏదీ..." ఆమె తాంబూల మిళితమైన పెదవులను చుంబించపోతుంటే మధ్య తను నలిగిపోతానేమో అనుకుని ఆ పసికందు క్యారు మన్నాడు.

---

మొగసాల మ్రోత

# పౌరస్వత్వాలు : కమ్యూనిస్టులు

మోపర్తి వెంకటరమణయ్య

మద్రాసు ప్రభుత్వం రాష్ట్రంలోని కమ్యూనిస్టు పార్టీని, దాని అనుబంధ సంస్థలను నిషేధించటంతో మళ్లీ పౌరస్వత్వాల సమస్య తలయెత్తింది. ప్రభుత్వ చర్య శాంతిభద్రతల రక్షణకు అనుగుణంగా ఉన్నదంటూ కొందరు సమర్థిస్తూంటే; మరికొందరు పౌరస్వత్వాలపై గొడ్డలిపెట్టని, ప్రజాస్వామ్య విరుద్ధమని ఖండిస్తున్నారు. వీరి వాదోపవాదాలను పరికిస్తున్న సామాన్య ప్రజలకు యేది ప్రజాస్వామ్యబద్ధమో, యేది ప్రజాస్వామ్య విరుద్ధమో అర్థంకాక అసలు పౌరస్వత్వాల సమస్యే అయోమయంగా కనపడుతున్నది. ఇట్టితరిలో కమ్యూనిస్టుల విషయంలో పౌరస్వత్వాలు యెంతవరకు అనువర్తించుతవో పరిశీలించటం అవసరం.

ప్రజాస్వామ్య విధానానికి పౌరస్వత్వాలు ప్రాణసమానమైనవి. ఏ ప్రభుత్వమైనా యెంతవరకు ప్రజాస్వామ్యమైనదీ అది ప్రజలకు ప్రసాదించే హక్కులపై ఆధారపడి ఉంటుంది. పార్టీ స్వాతంత్ర్యము ముఖ్యమయిన హక్కులలో ఒకటి. ప్రతి పౌరునకు తనకు యిష్టమైన పార్టీలో చేరటానికి, ఆ పార్టీ ప్రజలలో వ్యాప్తి చెంద చట్టసమ్మత పద్ధతుల ద్వారా కృషి చేయటానికి గల హక్కు గుర్తించ బడింది. అయితే యీ హక్కులతో పాటు పౌరులు నిర్వర్తించ వలసిన విధులు కూడా కొన్ని ఉన్నవి. పై హక్కులను అనుభవించే ప్రతి రాజకీయ పార్టీ కూడా ప్రభుత్వము యెడల, యితర రాజకీయ పార్టీల యెడల తాను నిర్వర్తించ వలసిన విధులను గుర్తించి తన కార్యక్రమాలను కొనసాగించవలసి ఉంది. ప్రజాస్వామ్య సూత్రాలకు బద్ధమైన ప్రతి పార్టీ తన రాజకీయ కార్యక్రమాలను శాంతియుతంగా, చట్ట సమ్మత పద్ధతులద్వారా కొనసాగిస్తూ - యితర ప్రజల లేక పార్టీల హక్కులకు యేవిధంగానూ భంగం కలిగించకుండా పనిచేయవలసివుంది. ప్రభుత్వము నుండి ప్రజాస్వామ్యపుహక్కులు పొందుతున్నంత వరకు ప్రభుత్వాన్ని ప్రతిఘటించే విషయంలో కూడా ప్రజాస్వామ్యవిధానాలనే అనుసరించాలి. ప్రజాస్వామ్య సూత్రాలను ఉల్లఘించే పార్టీకి ప్రజాస్వామ్య స్వత్వాలను పొందే అధికారం ఉండరాదు. ఈ సూత్రాన్ని కమ్యూనిస్టు పార్టీకి అన్వయించి చూస్తే సమస్య తేలికగా బోధపడుతుంది.

కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య వాదులని వారి సిద్ధాంతాలు, కార్యక్రమాలు తెలిసినవా రెవరూ అంగీకరించజాలరు. సాయుధ విప్లవము, కార్మిక